

# మౌనరాగం

సూర్యప్రసాదరావు

కళ్ళ ముందు ఒక్కసారి మెరుపు మెరిసినట్లయింది !

సందేహంలేదు... ఆమె సుమతి !!

చేతిలో ఏవో పేకట్స్....ఆమెకు వెనుకగా మెల్లగా కర్ర సాయంతో అడుగులేస్తూ రాఘవయ్య మాస్టారు. ఈ ఊరు వచ్చినప్పటి నుండీ సుమతిని చూడాలని తహ....తహ...

"మాస్టారూ...." పిలిచాడు రామచంద్ర.

"ఎవరూ బాబూ...మీరు?"

నేను..."మాస్టారూ..."

కళ్ళు చిట్లించి చూశారు.... క్షణకాలం జ్ఞాపకాలను వెదుక్కొన్నారు రాఘవయ్యగారు.

"ఏమీ అనుకోకు బాబూ ...గుర్తుపట్టలేక పోతున్నాను."

'నేను మాస్టారూ.....రామచంద్రను..."

సుమతి దగ్గరకొచ్చింది. గుర్తుపట్టినట్లు ఆమె ముఖంలో చిరునవ్వు ! ఆవిడ కలువరేకుల్లాంటి కళ్ళల్లో వెన్నెల కాంతులు చూడగలిగాడు.. రామచంద్ర....ఆ మధ్యాహ్నపు టెండలో!


"రామచంద్ర...అంటే..." మా సుమతి చిన్నప్పుడు....మీఎదురింటి ఇంజనీరు గారబ్బాయి..."

"అవును మాస్టారూ ... మూడవ తరగతి నుండి మీ దగ్గరే చదువుకున్న వాడిని.చిన్నప్పుడు నేనూ.... సుమతి కలిసి బడికి వెళ్ళేవాళ్ళం...'

"అవును బాబూ! గుర్తుకొచ్చింది. ఇప్పుడేం చేస్తున్నావు?"

"ఇక్కడే .... 'ఆర్ అండ్ బిలో జూనియర్ ఇంజనీర్‌గా ట్రాన్స్‌ఫర్ చేయబడ్డాను" మీ ఆరోగ్యం ఎలా వుంది మాస్టారు?"

"ఇంకెక్కడి ఆరోగ్యం.....ఊరు పొమ్మంటుంది....కాడు రమ్మంటుంది ...దీని పెళ్ళి చేస్తే చాలు హాయిగా కన్ను మూస్తాను."




సుమతి చూపులు రామచంద్ర గుండెల్లో గిలిగింతలు పెట్టాయి.

'అయితే సుమతి కింకా పెళ్ళి కలేదన్నమాట... హమ్మయ్య' రామచంద్ర రిలీఫ్ గా ఫీలయ్యాడు' అదేమిటి మాస్టారు! అరవై ఏళ్ళకే అంతా అయిపోయినట్లు మాట్లాడుతున్నారు. ఇంకా మీరు ఎందరు విద్యార్థులను తీర్చిదిద్దాలో....ఎన్ని ఇళ్ళల్లో ...యింకెన్ని విజ్ఞాన దీపాలు వెలిగించాలో....ఎన్ని యిళ్ళ దీపాలు వెలగాలో......."

"ఆ ఓపికా పోయింది నాయనా! గత రేండేళ్ళుగా నా ఉపాధ్యాయ వృత్తికే స్వస్తి చెప్పాను. ఏదో....పెన్షన్ డబ్బులు మీద నేనూ, అమ్మాయీ బ్రతుకుతున్నాము. అలా మా యింటికి రాకూడదూ...కాస్త కాఫీ త్రాగి పోదువు గానీ.... చాలా సంత్సరాలయింది...''

"అంతకన్నాటేనా....మాస్టారూ !"

మాస్టారి తో బాటు నడవబోతూ ....రామచంద్ర వెనుకకు తిరిగి సుమతిని చూశాడు. అతనినే పరిశీలనగా చూస్తున్న సుమతి చూపులు రామచంద్ర చూపుల్లోచిక్కుకు పోయాయి.

సుమతి తలదించుకొంది.

రామచంద్ర ఆమెను ఆపాదమస్తకం పరిశీలించాడు.

తీర్చిదిద్దినట్లున్న విగ్రహం...అందమైనది... దానికితోడు అందమైన అలంకరణ !

గులాబీరంగు రంగరించిన వెన్నెల్లో ....దుస్తుల్లో....అరవిరిసిన గులాబీలా వుంది!'

"ఓహ్ ! ఈ అందమంతా యింకా తనకోసమే వేచి ఉందేమో!'

"సుమతీ ! పెళ్ళంటూ చేసుకుంటే....నిన్నే చేసుకుంటా ......"

"నేను మాత్రం నిన్ను జన్మలో చేసుకోను' '

"ఏం?"

"నీ అంత మొండివాడిని నేనెక్కడా చూడలేదు. నేను ఔనంటే...నీవు కాదంటావు. నేను కాదంటే...నువ్వు ఔనంటావు... నీతో సంసారం చేయడం ఆ బ్రహ్మ తరం కూడా కాదు..."

"మగవాడితో.... మగవాడెప్పుడైనా కాపురం చేస్తాడా !"

"ఛీ.....పో...."

"అయితే....నన్ను చేసుకోనంటావు ....."

"చేసుకోనంటే.... చేసుకోను"

"తాయిలం పెడతాగా...."

"పెట్టినా సరే "

"మరయితే ...ఎవరిని చేసుకుంటావు ?' '

"ప్రక్కింటి ప్రకాష్ను"

**"అయితే.. ప్రకాష్తోనే... రోజూ బడికి వెళ్ళు!** నాతో ఎందుకు యిక నీకూ....నాకూ.... రాం....రాం..... "సుమతి నెత్తిన ఓ మొట్టికాయ మరీ వేసి జారిపోతున్న నిక్కర్ను పైకి లాక్కుంటూ పరిగెత్తాడు రామచంద్ర!.

"లోపలికి రావయ్యా ! రామచంద్రా !'

మాస్టారి మాటలతో యీ లోకంలోకి వచ్చిపడ్డాడు.

"అమ్మా...సుమతీ ! కొన్ని కాఫీ పెట్టమ్మా....రావయ్యా...రా....అలా కూర్చో...." రాఘవయ్యగారు పడకకుర్చీలో కూర్చుంటూ....ఎదురుగా ఓ కుర్చీ చూపించారు.

"ఏం బాబూ ! మంచి నీళ్ళేమయినా కావాలా ."

రామచంద్ర తలూపాడు....కావాలన్నట్లు' మరుక్షణం రెండు గ్లాసులతో సుమతి ప్రత్యక్ష్యం !

రామచంద్రకు గ్లాసు అందిస్తోంటే వ్రేళ్ళుతగిలాయి.

ఇద్దరికీ ఎలక్ట్రిక్ షాక్ తగిలినట్లయింది. వెంటనే వ్రేళ్ళు వెనక్కి లాక్కుంది.

"నిజంగా నాకు చాలా సంతోషంగా ఉందోయ్....నువ్వింత వాడవైనందుకు. ...అన్నట్లు.... అమ్మా...నాన్నా ఎలావున్నారు? చెల్లి బావున్నదా...అంతా యిక్కడే వున్నారా...." రాఘవయ్యగారు ప్రశ్నల వర్షం కురిపించారు.

"నాన్నగారు పోయి నాలుగేళ్ళయింది మాష్టారూ...నేను ఇంజనీరింగ్ ఫైనలియర్లో వుండగానే హార్ట్ ఎటాక్తో పోయారు ! క్రిందటేడే మంచి సంబంధం చూసి చెల్లాయి పెళ్ళి చేశాము. బావగారు విజయవాడలో...డాక్టర్ ! అమ్మ ప్రస్తుతం నా దగ్గరే ఉంటోంది....యిక్కడే ..."

"అయితే...నీకు ..." అర్థోక్తిలో రాఘవయ్యగారు ఆగిపోయారు.

"పెళ్లింకా కాలేదు మాస్టారూ..... చేసుకోవాలని చూస్తున్నా ...."

"అంతే నాయనా....అంతే ! ఆఘడియ రానిదే మన మేమీ చేయలేము. సుమతికీ అంతే ! ఆ ఘడియ వచ్చిందంటే ...ఒక్కనిముషం ఆగదుమరి ! పేపర్ చూస్తూ వుండు....అలా పెరట్లోకి వెళ్ళివస్తా

రామచంద్ర పేపర్ చేతుల్లోకి తీసుకున్నాడు. పేపర్ చూడాలని పించడంలేదు...గతస్మృతులు మనసును చుట్టేస్తున్నాయి.......

చిన్నప్పుడు తను రోజులో ఎక్కువసేపు మాస్టారి యింట్లోనే ఉండేవాడు. ఆగదిలోనే......సుమతీ.....తనూ చిన్న తనాన్ని గడిపేసి మమతలను పంచుకొన్నదీ....పెంచుకొన్నదీ..

గోడమీద వ్రేళ్ళాడుతూ... అప్పటి ఫోటులో! చాలా నిశితంగా పరిశీలిస్తేనే గుర్తు పట్టగలిగేది.... అప్పటి సుమతి.... గౌనులో.... రెండు జడల్తో... యింతింత చక్రాల్లాంటి రెండు కళ్ళతో...

ఇల్లంతా కలయజూస్తున్నాడు రామచంద్ర....అప్పటి కంటే బాగా నల్లబడి పోయిన గోడలు...గాలిని, వెలుతురునూ ధారాళంగా ప్రవహింపచేసే యింటి

కప్పు.....సూర్య చంద్రులు ఒకరి తరువాత మరొకరు ఆయింటి నేలను పలకరించి పోతూ వుంటారు.....

కిటికీలోంచి దృష్టిసారిస్తే.....ఎదురుగా నుందర ప్రకృతి దృశ్యం....అదే ఏరు.....దూరంగా పారుతూ....ఆ ఏటి గట్టున అదే జామచెట్టు....ఆ చెట్టు క్రింద ఆడుకుంటూ .....పిల్లలు.....

"రామూ! నాకు ఒకజామకాయ కోసిపెట్టవూ?"

"నేను కోయనంటే కోయను..."

"ప్లీజ్.....ఒక్కటంటే.....ఒక్కటే .....కాయ...'

"మరి...కోసిపెడితే....నాకు ఏంపెడతావు?'

"ఏది కావాలన్నా....పెడతాను"

"ఏది కావాలంటే అది పెడతావా..."

"పెడతానన్నానుగా.... కోయి...."

వెంటనే చెట్టు మీదకు లంఘించాడు....మరో నిమిషంలో. ...దోరజామ పండుతో సుమతి ముందు....రామచంద్ర !

"ఏటిగట్టున కూర్చుందాం... పద..." సుమతి దారి తీసింది"యిదిగో .....ఉప్పును కూడా చిన్న పొట్లం కట్టుకొచ్చాను..."

"ఉప్పు అయితే పట్టుకొచ్చావు గానీ.... కాయను ముక్కలు చేయడం ఎలా?"

"అంత అమాయకుడిలా అడుగుతావే....ఏదీ....యిటివ్వు.....చూపిస్తా.'

' రామచంద్ర చేతిలో జామకాయ లాక్కుంది'. మెల్లగా పరికిణీ అంచుతో కాయను చుట్టి పట్టుకొని. పళ్ళతో కొరికి రెండు ముక్కలు చేసింది. రామచంద్ర చేతిలో ఓ ముక్క పెడుతూ.....

"ఇదేం....ఎంగిలి కాదులే.....కాకి ఎంగిలి.... ఈ ముక్క ఉప్పులో నంచుకో.....బావుంటుంది. "నోరు జివ్వు మనిపించింది.

"కాయ కోసిస్తే.....ఏదికావాలంటే....అది పెడతానన్నావుగా......"

"కాకి ఎంగిలి పెట్టావా..."

"కాకి ఎంగిలి కాదు.....నిజమైన ఎంగిలి...

"ఛీ....పో.....నీకసలు బుద్ధి లేదు...."

అడుగుల చప్పుడు తో రామం ఏకాగ్రత చెదిరింది......


ఎదురుగా కాఫీ కప్పుతో సుమతి!

కప్పు అందుకుంటూ ఒక్కసారి ఆమె కళ్ళల్లోకి చూశాడు. నాలుగు కళ్ళు కలుసుకున్నాయి. రామచంద్ర గుండెలు దడదడలాడాయి....చప్పున సుమతి కళ్ళు దించుకుంది.

క్షణాలు గడిచిపోతున్నాయి....ఏమేమో మాట్లాడాలని....ఏమీ మాట్లాడలేని అశక్తత....చిన్నప్పటి చిలిపిచేష్టలన్నీ కనుల ముందు కదలాడుతున్నాయి.....సిగ్గుల మొగ్గయిన సుమతి మరీ ముడుచుకు పోయింది.

భావా, భాషా గొంతుకలో గూడ కట్టుకుపోయినట్టుంది....రామచంద్రకు! ఏమని వలకరించాలి? ఎలా వలకరించాలి? ముందు ఆమె పలకరిస్తుందా...తానే పలకరించాలా ....లేదు....తనే పలకరించాలి..... తనే ' పలకరించాలి....

రామచంద్ర గొంతు సవరించు కున్నాడు.. .



"సుమతీ ! బావున్నావా ?"

సుమతి చిన్నగా తలూపింది....

"నిన్ను చూడాలని ఎన్నాళ్ళనుంచో అనుకుంటున్నాను....."

మెల్లగా రామచంద్ర లేచాడు.....అలా కాఫీ కప్పు పట్టుకొనే....

సుమతి రెండడుగులు వెనక్కి వేసింది.

"నిజం ....సుమతీ...... నిన్ను చూడాలనే యీ వూరు ట్రాన్సఫర్ చేయించుకొన్నాను " సుమతి ముఖంలో ....ప్రశ్నార్ధకం..... 'ఎందుకనో.....?

"అబ్బబ్బ....ఏమి ఎండ....ఏమి...ఎండ... అప్పుడే రోహిణీ కార్తె వచ్చేసినట్లుంది..."

మాస్టారి రాకతో సుమతి వెను తిరిగింది

"అలా కప్పు పట్టుకొని నిలుచుండి పోయా వేమయ్యా... కూర్చో...."

"ఏమీ లేదు....మాస్టారూ...." రామచంద్ర తడబడ్డాడు.

"కూర్చోవయ్యా.... కూర్చొని కాఫీ త్రాగు....చల్లారిపోతుంది....." తనూ కాఫీ కప్పుతో....రాఘవయ్య గారు కుర్చీలో కూర్చుంటూ.......

కాఫీ సిప్ చేస్తూనే మాస్టారన్నారు ...."చిన్నప్పుడు అంత చురుకుగా ....చలాకీగా వుండేవాడివి.... పెద్దవాడైన కొద్దీ చురుకుదనం పెరగాలి గానీ....ఏవింటయ్యా..యిలా అయిపోయావు...?"

"ఏమీలేదు మాస్టారూ! ఎన్నాళ్ళయిందో మిమ్మల్ని చూసి ! ! అందుకే....గత స్మృతులు ఒక్కసారి నన్ను పరధ్యానంలోకి పట్టుకు వెళ్ళాయి"

"నిజమే రామచంద్రా! మీ చిన్నతనమంతా కలలా జరిగిపోయింది. మీరు మా యింటి ఎదురుగా వున్నంత కాలం మాకూ అలానే వుంది. కానీ మీరు యిక్కడి నుండి వెళ్ళిపోయిన తరువాతే....ఎన్నో మార్పులు ....మార్పు లేనిది నాజీవితమే ! ఐదారు నెలలకోమారు జీతాలు ! నాతో బాటు అమ్మాయికూడా నలుగురికీ నాలుగు ముక్కలు చెప్పేది .... అట్యూషన్ డబ్బే వేణ్ణీళ్ళకు చన్నీళ్ళా మమ్మల్నాదుకునేది .'

నిశ్శబ్దంగా ....వింటున్నాడు.....రామచంద్ర!

"ఆ పరిస్థితిలోనే....సుమతి తల్లికి ఖరీదైన వ్యాధి సంక్రమించింది.....'క్షయ' సరియైన మందులు సక్రమంగా వాడితే....అసాధ్య మైన ట్రీట్మెంట్ అయితే....కాదు కానీ....వచ్చీరాని జీతాలు... ఆర్థిక యిబ్బందులు....దాని ప్రాణం నిలవలేకపోయాయి.... అంతే మాయింటి దీపం ఆరిపోయింది."

రాఘవయ్య మాస్టారు కళ్ళజోడు తీసి కళ్ళు తుడుచుకున్నారు. అంత వయసులో కూడా ఆయన చేత కంటనీరు పెట్టించిన

ఆవిడ మరపురాని సహధర్మచర్యం.

కొద్ది సేపటికి తేరుకొని అన్నారు.....

"సరిగ్గా మీరు వెళ్ళిన నాలుగేళ్ళకు సుమతి యాడేరింది. సంబరం లేదు... సంతోషం లేదు...అయినా మనను ఊరుకోదుగా. ఉన్నదానిలోనే సర్దుబాటు చేశా....ఇక ....వయసు..... దాని సంగతి తెలియనిదేముంది....అది పెద్దదై పోతోంది......దాన్ని ఓ అయ్య చేతిలో పెట్టాలని గత నాలుగేళ్ళుగా ప్రయత్నం చేస్తానే వున్నా! కుఱ్ఱవాడికి పిల్లనచ్చితే....తల్లిదండ్రులకు నేనిచ్చే కట్నకానుకలు నచ్చడంలేదు. తల్లిదండ్రులు ఒప్పుకుంటే.....కుఱ్ఱవాడు 'మోడ్రన్' గా లేదని పెదవి విరుస్తున్నాడు. పెళ్ళి చూపులకు వస్తానే వున్నారు...పోతూనే వున్నారు.....అన్నట్లు .....రామచంద్రా ! ఈ వేళ ఐదవ తేదీకాదుగదా......"

సడెన్‌గా టాపిక్ ఎందుకు మార్చారో రామచంద్రకు అర్థం కాలేదు.

"అవును మాస్టారూ! ఈ వేళ ఐదవ తేదీనే.....విశేషమా ?"

"విశేషమేనయ్యా ! మాటల్లో పడి మర్చిపోయా? ఈ రోజు నాలుగున్నరకు సుమతిని చూడడానికి పెళ్ళివారొస్తున్నారు.....టైమెంతయింది?"

"సరిగ్గా నాలుగు గంటలు...."

"నాలుగు గంటలా ! పేపరు చూస్తాండు....ప్రక్క యిళ్ళ నలుగురైదుగురు ముత్తైదువులను పిలిచి వస్తాను...." మాస్టారు రామచంద్ర సమాధానం కోసం చూడలేదు.

రామచంద్ర సందిగ్ధంలో పడ్డాడు....

'ఏం చెయ్యాలి? మాస్టారికి చెప్పకుండా వెళ్ళిపోతే....సభ్యత అనిపించుకుంటుందా! పోనీ సుమతికి చెప్పి వెళ్ళిపోతే....ఎక్కడో పెరట్లో...ఒంటరిగా ! తనన్ను అపార్థం చేసుకోదుగదా.... త్వరగా వెళ్ళి పోవాలి.... ఎలా... ఎలా వెళ్ళాలి?

అడకత్తెరలో పోక చెక్క మాదిరిగా వుంది రామచంద్ర పరిస్థితి.

అనాలోచితంగానే చూచిన పేపర్‌నే అందుకున్నాడు. కళ్ళు అక్షరాలనే చూస్తున్నా....మనసు చుట్టూ పరిభ్రమిస్తూ పరిపరి విధాలుగా ఆలోచనలు......

'సుమతికి పెళ్ళిచూపులు. ...అదీ.....తన సమక్షంలో! ఎవరికోసమైతే తాను యీ ఊరు ట్రాన్సర్ చేయించుకున్నాడో...ఎవరి కోసమైతే తను రాత్రింబవళ్ళు కలవరించి పలవరించాడో.... వచ్చిన దగ్గర నుండి తాను ఎవరికోసమైతే వెతుకుతున్నాడో.... ఆ సుమతి.....తన సుమతి....తన నుండి దూరం కాబోతోంది !! ఒక వేళ....ఆ వచ్చిన వారికి సుమతి నచ్చితే....... తన ముందే నిశ్చయ తాంబూలాలు...లగ్న పత్రిక నిర్ణయం.....తరువాత.... పందిట్లో పెళ్ళి....బాజాలు.... భజంత్రీలు.....పెళ్ళి బట్టల్లో సుమతి.... తన సుమతి ప్రక్కన మరొకరు....తను వుండవలసిన స్థానంలో....

'ఎలాగైనా తను మాస్టారికి చెప్పేయాలి....సుమతి తనదని! సుమతికి అభ్యంతరం ఎందుకుంటుంది? ఉంటే....తనను చూచినప్పుడు ఆ కళ్ళల్లో వెన్నెల సోనలు... తన చూపులతో కుసుకున్నప్పుడు.....ఆ బుగ్గల్లో విరబూసిన గులాబీలు..... ఏమయినా సరే....నా సుమతి ప్రక్కన మరొకరుండ కూడదు.....

"ఇప్పుడే మాస్టారికి చెప్పాలి... చెప్పేస్తే ... నంస్కార మనిపించు కుంటుందా... పెళ్ళి చూపుల జరగబోయే ముందు చెప్పడం సబబనిపించు కుంటుందా... 'ఇంతకాలం ఏం చేశావయ్యా... రామచంద్రా' అని మాస్టారంటే...'

"రామచంద్ర ఆలోచనల్లో పడ్డాడు....

"వడ్డించాను రండి! భోంచేద్దురు గాని...."

"అబ్బ! ఉండవే....ఆఫీసు పనితో తలబ్రద్దలౌతుంటే "

"ఆఫీసు పని తరువాత చూసుకోండి... ముందు భోజనానికి రండి"

"ఒక్క పదినిమిషాలు ఆగరాదూ?"

"నేను ఆగినా..... యిక్కడ వంట ఆగదు. చల్లారి పోతోంది. మీరు త్వరగా భోజనం చేస్తే.... తరువాత నేను చెయాలి. అవతల పాప పాలకేడుస్తోంది. దానికి పాలిచ్చి మీకిస్తే తప్ప నేను భోంచేయడానికి వీలు లేదు...."

"అయితే వస్తున్నా....ఆఫీసుపని తరువాత చూసుకుంటాలే...."

రామచంద్ర లక్క పిడతల ముందు కూర్చొని భోజనం చేస్తుంటే..... సుమతి చెబుతోంది....."ఈరోజు యింట్లో అన్ని నిండుకున్నాయి . పప్పు...ఉప్పు.... చింతపండూ....అలాబజారెళ్ళి నప్పుడు తీసుకునిరండి"

వల్లెవాటుగా వేసుకున్న తువ్వాలును కొద్దిగా పైకెత్తి బొమ్మపాపాయికి పాలు య్యివారంభించింది..

"అలాగే......బజారు వెళ్ళేటప్పుడు గుర్తుచేయి....తీసుకువస్తా..."

"అన్నం పెట్టి ఎంత సేపయింది? ముందుగదిలో...ఏం చేస్తున్నావ్? " తల్లి కేక పెట్టడంతో బొమ్మ వంటసామాన్నంతా సర్దేసి సుమతి అంది" ఈ రోజు కిక చాలు. రామం! మళ్ళీ రేపు ఆడుకుందా... అమ్మా... నాన్న " ఆట".

"వచ్చేశారయ్యా....పెళ్ళివారు వచ్చేశారు...." మాస్టారి మాటలు రామచంద్రను యీలోకంలోకి తెచ్చాయి..

"రండమ్మా.....రండి...రా...బాబూ" రాఘవయ్య మాస్టారు సాదరంగా గుమ్మంలో ఆహ్వానిస్తుంటే....పెళ్ళి చూపులకు పెళ్ళివారు యింట్లోకి వచ్చేశారు.

పెళ్ళి కొడుకు నలుపుక్రిందే లెక్క! దానికి తగ్గట్టు....డార్క్ పాంట్.... గ్రేకలర్ షర్ట్.... అప్పుడే తొంగిచూస్తున్న బట్టతల....బొద్దింక మీసాలు......

'యితనేనా. సుమతిని కట్టుకొనేది? ' 'రామచంద్ర మనసు బాధగా మూలిగింది. మర్యాదలన్నీ పూర్తయ్యాయి.....

"అమ్మాయిని తీసుకురండమ్మా..." రాఘవయ్యగారు లోపలకు కేకేశారు. ముత్తైదువలసహాయంతో తలవంచుకొని సుమతి ముందుగదిలోకి కుడికాలు పెట్టింది.

ఆకు పచ్చని చీర ... అదే రంగు జాకెట్... చేతులకి పచ్చని గాజులు ..... ఎడమ ప్రక్కగా తీసిన పాపిట... చెవులకు జూకాలు... తీర్చిదిద్దిన ఆకారం... పచ్చని వనదేవతలా ఉంది.

రామచంద్ర కళ్ళు త్రిప్పుకోలేక పోతే... పెళ్ళి కొడుకు సంగతి చెప్పనవసరం లేదు".

"నీపేరేమిటమ్మా?"

"....................."

"ఎంతవరకు చదువుకున్నావు?"

"........................'

"వంటపని...యింటిపనీ ... వచ్చా"

"..................."

చురుగ్గా కళ్ళెత్తి చూచింది....సుమతి తండ్రివంక!

రాఘవయ్యగారందుకున్నారు....

"మధ్యవర్తి మీకన్నీ చెప్పే వుండాలి. అమ్మాయి పరిస్థితి తెలిసి వుండి కూడా మీరిలా ప్రశ్నలడగడం ఏమీ బాగాలేదు"

"అమ్మాయికి కొద్దిగా 'నత్తి' అని పేరయ్యగారన్నారు..."త

"కాదమ్మా! దాని పదమూడో ఏట...ఓ దుర్మూహూర్తంలో....టౌఫాయిడ్‌లో అది వాక్కు కోల్పోయింది...."

"అయితే....మూగదన్నమాట.....'

"మూగదాన్ని చూడడానికేనా...యింత దూరం వచ్చింది...లేవరా...అబ్బాయీ"

పెళ్లి కొడుకు లేచాడు ... తల్లి మాటలకు!

"మూగదైనా ఫరవాలేదు...కానీ ధర కాస్త ఎక్కువ పెట్టాలి....ఎంతోకాదు.... ఎభైవేలు..."

తండ్రిమాటలతో పెళ్ళి కొడుకు మళ్ళీ కూర్చున్నాడు.

"ఏభై వేలే.....అంత డబ్బు నాదగ్గరలేదు.."

"అంత డబ్బు యివ్వలేకపోతే ఎవరు చేసుకుంటారయ్యా.....నీ మూగపిల్లను..... ఈ ప్రపంచంలో....బొందిలో ప్రాణం వున్నవాడెవడూ చేసుకోడు. మీ అమ్మాయికీ పెళ్ళికాదు....లే ...లెండి.....పోదాం పదండి.... ఒక్కక్షణం యిక్కడ వుండొద్దు..'

మాస్టారు బ్రతి మాలుతునే వున్నారు. పెళ్ళి వారూ వెళ్ళిపోయారు.

రామచంద్ర నిశ్చేష్టుడైపోయాడు.. ...కోటి పిడుగులు కురిసినట్లయింది. సప్త సముద్రాలు పొంగి తన్ను ముంచి వేసినట్లయింది. పట్టపగలే గాఢాంధకారం ఆవరించినట్లయింది.

'తన సుమతి మూగది ! తన చెవుల్ని తానే నమ్మలేకపోతున్నాడు. తను ఆరాధించిన సుమతి మాట్లాడలేదు.'

"నేను మాత్రం నిన్ను మాత్రం జన్మలో పెళ్ళి చేసుకోను"

"ఇదేం ఎంగిలి కాదులే....కాకిఎంగిలి..

"వడ్డించాను రండి...భోంచేద్దురుగాని'

'తన సుమతి యిక పిలువలేదు "రామం" అని పలకరించలేదు'

రామచంద్ర మనసులో శత సముద్రాల హోరు....కానీ.....

సుమతిని చూచిన క్షణంలో..... తనలో స్పందన ఆమె పట్ల తన ప్రేమ.... ఆరాధన....అంతా అయోమయంగా వుంది.

ఎదురుగా వాలుకుర్చీలో పడుకొని శూన్యంలోకి చూస్తూ....మాస్టారు....

ఇంతలో.... వంటింట్లోంచి పెరట్లోకి ఎవరిదో పరుగు...వెను వెంటనే.... ఆమె వెనుక మాస్టారు ....మరుక్షణం మాస్టారి కేక.......

"బాబూ! రామచంద్రా....సుమతి బావిలో పడబోతోంది...."


రామచంద్ర యిక ఉండబట్ట లేకపోయాడు.

పెరటి బావిదగ్గర..... మాస్టారి చేతుల్లోంచి విడిపించుకోడానికి....సుమతి గింజు కొంటోంది. ..వయసు మళ్ళిన మాస్టారు ఆపుకోలేకపోతున్నారు...

రామచంద్ర బలవంతంగా సుమతిని

"ఆత్మహత్య చేసుకోవాల్సిన అవసరమేమొచ్చిందమ్మా! ఈ సంబంధం కాకపోతే మరో సంబంధం...నా బంగారు బొమ్మను చేసుకోనే అదృష్టం వాళ్ళకుండాలిగానీ.... ఆ మాత్రానికే అధైర్య పడిపోతే....యీ ముసలి వాడేం కావాలమ్మా? నువ్వుపోతే నాగతి ఏమిటో..... ఒక్కసారి ఆలోచించావా.....నా ఆకలి కనుక్కొని నాకింత పెట్టేవారు ఎవ్వరమ్మా...." మాస్టారి కంఠం దగ్గమైపోయింది. వెక్కుతున్న శబ్దం..... నిట్టూర్పు ఒక శబ్దానికి....మరొకటి తోడు.......

సుమతి స్పర్శ కలిగించిన పులకరింతలతో.....రామచంద్రలో పలవరింలేదు..... ఆక్షణంలో ఏమీ అనిపించకపోయినా... తనది అనుకున్న ఆమె స్పర్శ....సందేహంలేదు..... ఆమె స్పందనకు నాంది.... బహుశః తనగురించేనేమో ఆ పెళ్ళిచూపులు విఫల మయ్యాయి....సుమతి మూగదైతేనేం..... మాట్లాడే ఆకనులు...మధురగీతాలా అనిపించే ఆ చూపులు....హావభావాలకు ఆలవాలమైన సుందర వదనం....ఆకర్షించే విగ్రహం.......




వంటింట్లోకి ఎత్తుకొచ్చేశాడు.

పురుషస్పర్శ అదీ....పర పురుష స్పర్శ....యవ్వన స్పర్శ....అంతటి విరక్తిలోనూ యిబ్బంది. ఫీలయింది. అందుకే ప్రతిఘటించలేదు.

కరుణ వంటి కన్నీటితో నిండిన సుమతి కళ్ళు... దైన్యానికి ప్రతీకగా ఆమె వదనం రామచంద్రలో కలవరం కలిగించాయి.

పెరటి తలుపుల గడియవేసి రామచంద్ర ముందుగదిలోకి వచ్చేశాడు. మాస్టారు అక్కడే వుండిపోయారు. ....కుమార్తెను ఓదారుస్తూ.

ఓ నిశ్చయానికి వచ్చి....రామచంద్ర లేచాడు....

"మాస్టారు...." పిలుపుకు మాస్టారు బయటకు వచ్చారు. కళ్ళు తుడుచుకుంటూ..

"వస్తాను.....మాస్టారు....."

"అప్పుడే వెళ్ళిపోతున్నావా ....కాసేపుండిపోరాదూ...."

"వెళ్ళివస్తాను మాస్టారూ.....మరోసారి మా అమ్మతో..."

"మీ అమ్మగారితో వస్తావా."

"అవును మాస్టారూ....సుమతిని

నాదానినిగా చేసుకోడానికి....అమ్మతో వస్తాను.."

"బాబూ!" మాస్టారు తన చెవులను నమ్మలేక పోయారు."

నిజమా....రామచంద్రా! నాతల్లిని. ...నువ్వు....నవ్వు పెళ్ళి చేసుకుంటావా...!!

" నిజం మాస్టారూ....మీ అమ్మాయిని నాకివ్వమని అడగడానికే....అమ్మను తేస్తాను."

"బాబూ....రామచంద్రా!" మాస్టారి కళ్ళల్లో ఆనంద బాష్పాలు.

"తప్పా....మాస్టారూ.... సుమతితో నా యింటి దీపాలు వెలిగించుకుంటాను. నాలో విజ్ఞాన దీపం వెలిగించిన మాస్టారి జీవితంలో చీకటి పోగొట్టడానికి! ఈ విషయం నేను యిక్కడకు వచ్చిన వెంటనే చెబుదామనుకున్నాను. అయినా సుమతి మూగదని' పెళ్ళివారు వెళ్ళిపోయిన తరువాత....గట్టిగా నిశ్చయించుకున్నాను....' సుమతిని నా దాన్ని చేసుకోవాలని ....వస్తాను మాస్టారూ.... మరోసారి మంగళ వాయిద్యాలతో...." మాస్టారి కళ్ళనుండి దొరలుతూ... ఆనందాశ్రువులు...

గుమ్మందగ్గనుండి వింటున్న సుమతి కళ్ళలో ......కోటి దీపాల కాంతులు....

బయటకొచ్చేస్తుంటే పక్కయింటివాళ్ళ రేడియోలోంచి పెద్ద శబ్దంతో సుశీల పాట వినిపిస్తోంది.....

"మాటలకందని భావాలు మంచి మనసులు చెబుతాయి

కవితలకందని భావాలు కంటి పాపలే చెబుతాయి....."

●

